

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కాను కల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,50,630లు, బంగారం 2 గ్రాములు20 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వరాహ అవతారంలో జగన్నాథుడు

గుండిచా మందిరంలో కొలువైయున్న శ్రీజగన్నాథుడు బుధవారం వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు.

- 8లో



రూ.200 కోట్లతో కార్పస్ నిధి

ఒడియా అస్మితా భవన్ కోసం రూ.200 కోట్ల కార్పస్ నిధి ఏర్పాటుతో సహా 5 ప్రతి పాదనలకు రాష్ట్ర మంత్రి మండలి బుధవారం ఆమోదం తెలిపింది.

- 8లో

న్యూస్‌రీల్

కాసీపూర్‌లో డిప్యూటీ సీఎం పర్యటన నేడు

రాయగడ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పారిడా కాసీపూర్‌లో గురువారం పర్యటించనున్నారు. ఆమె పర్యటన వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం ఈ మేరకు ప్రకటించింది. దీనిలో భాగంగా గురువారం ఉదయం 7.40 గంటలకు ఆమె నయాపల్లి (భువనేశ్వర్)లోని వసతి గృహం నుంచి బయల్దేరి బిజూ పట్నాయక్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 9.15 గంటలకు కాసీపూర్‌కు చేరుకున్న ఆమెకు బీజేపీ శ్రేణులు స్వాగతం పలుకుతారు. అనంతరం 10.20 గంటలకు కాసీపూర్‌లోని హనుమాన్ మందిరం వెనుకనున్న మైదానంలో జరగనున్న బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.20 గంటలకు సమితి కార్యాలయంలో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

ఆగివున్న వాహనాన్ని ఢీకొన్న బస్సు



బస్సు ముందరి భాగం దెబ్బతిన్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రం నుంచి కటక్ వైపు వెళ్తున్న బస్సు బుధవారం వేకువజామున బొలంగీర్ జిల్లా వద్ద నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొంది. ప్రమాద సమయంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో పాటు బస్సు కుదుపుకి గురవ్వడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. ప్రమాదంలో బస్సు ముందరి భాగం దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి గాయాలవ్వకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పుట్ట గొడుగు తిని నలుగురికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోమనాథ్ కుటుంబ సభ్యులు

రాయగడ: కొండల్లో లభించే విషపూరిత పుట్ట గొడుగును వండుకొని తిన్న నలుగురు వ్యక్తులు అస్వస్థతకు గురైన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి రెంగా గ్రామంలో చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అస్వస్థతకు గురైన వారిని కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. రెంగ గ్రామంలో ఉంటున్న సోమనాథ్ జొడియా అనే వ్యక్తి సమీపంలోని కొండల్లో లభించిన పుట్టగొడుగును ఇంటికి తీసుకొచ్చాడు. దానికి మంగళవారం రాత్రి వండుకుని అతను, అతని భార్య శోభమణి, కొడుకు జుధిష్టర్, కోడలు ప్రమీలలు తిన్నారు. అయితే కొద్దిసేపటికే అందరికీ వాంతులు, కడుపు నొప్పి వచ్చి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఇరుగుపొరుగు వారు గమనించి వారిని ఆస్పత్రికి తరలించారు. వీరిలో సోమనాథ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలియజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థిని


కొరాపుట్: నబరంగ్‌పూర్ మహిళా మహా విద్యాలయంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 10 మంది విద్యార్థినులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనన్నారు. ఆపద సమయంలో ఎంతోమందికి రక్తం అవసరమవుతుందని పేర్కొన్నారు. రక్తదానం వలన సమాజంలో అనేక మరణాలు ఆపవచ్చునని తెలపారు. ఈప్సా ఫౌండేషన్, సమాజ్, ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు సంయుక్తంగా శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. కార్యక్రమంలో ఏడీఎం నవీన్ చంద్ర నాయక్, ఈప్సా ఫౌండేషన్ ప్రతినిధి సంజయ్ కుమార్ పండా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దిలీప్ కుమార్ దాస్, బంక బిహారి బిసోయి, సంజుక్తా పండా తదితరులు పాల్గొన్నారు.

భళా.. చిత్రకళ

ఆకట్టుకున్న శ్రీజగన్నాథుని చిత్రకళ ప్రదర్శన



శ్రీకృష్ణుడే జగన్నాథుడు అని తెలిపే చిత్రం



స్వామివారికి భోగం సమర్పిస్తున్న సేవాయత్తులు



శ్రీమందిర భగవానుడు జగన్నాథుడు




సృష్టికి శ్రీజగన్నాథుడే మూలమని చాటుతున్న చిత్రం



శ్రీజగన్నాథుడిని కౌగిలించుకుంటున్న భక్తుడు

పట్టణంలోని విక్రమ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో 'దారు దేవత' చిత్రకళ ప్రదర్శనను ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి బుధవారం ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థులు, అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ చిత్రకళ ప్రదర్శనలో పాల్గొనేందుకు 'దారు దేవత' చిత్ర లేఖనకు ఈనెల 7వ తేదీన ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ చిత్రలేఖనలో పలువురు విద్యార్థులు పాల్గొని దారు దేవతా చిత్రాలను పూర్తి చేయగా, వాటిని ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో బుధవారం ప్రదర్శించారు. ఈ చిత్రాలు శ్రీజగన్నాథుని వైభవాన్ని చాటుతున్నాయని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, జిల్లా సాంస్కృతిక పరిషత్ అధికారి ప్రీతిసుధా జెన, కళాశాల ప్రిన్సిపాల్ జుధిష్టర మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. -జయపురం



వృక్షం చెంత దారు దేవత



చిత్రకళ ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు



దారు దేవుడిని ఉలితో రూపొందిస్తున్న శిల్పి



శ్రీజగన్నాథుడికి పూజలు జరుపుతున్న పండాలు



ఆకట్టుకుంటున్న దేవదేవుడి చిత్రం



రథయాత్రలో జగన్నాథున్ని రథం వద్దకు తోడ్కొని వెళ్తున్న అశేష భక్తజనం



అన్న ప్రసాదానికి జగన్నాథుని ఆశీర్వాదం



ధనరాసులు అందించే జగన్నాథుడు

కానిస్టేబుల్ టు ఎమ్మెల్యే



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్

- ముఖ్య అతిథిగా ఆహ్వానించిన ఎస్పీ

కొరాపుట్: పదేళ్ల క్రితం అతనొక కానిస్టేబుల్. అప్పుడు జిల్లా ఎస్పీకి సెల్యూట్ కొట్టేవారు. కానీ నేడు అతనొక ఎమ్మెల్యే కావడంతో అతనినే ఎస్పీ సాదరంగా ఆహ్వానించిన ఘటన చోటుచేసుకుంది. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ బ్యారక్ గ్రౌండ్‌లో వన యజ్ఞం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి హాజరయ్యారు. దీంతో ఆయనను ఎస్పీ రోహిత్ వర్మ గౌరవంగా ఆహ్వానించి మొక్కలు నాటేందుకు తీసుకెళ్లారు. గతంలో ఇదే చోట గౌరీ కానిస్టేబుల్‌గా పనిచేశారు. గౌరీ రావడంతో నాటి సహచరులైన కానిస్టేబుల్స్ ఆనందంగా ఆలింగనం చేసుకోవడంతో ఉద్వేగ వాతావరణం నెలకొంది.

భారీగా గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో పోలీసులు

కొరాపుట్: జిల్లాలోని పాడువా పోలీసులు 204 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పసస్‌పుట్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. దీనిలో భాగంగా అక్కడ పొదల్లో 17 బస్తాల్లో రవాణాకి సిద్ధంగా ఉంచిన గంజాయి పట్టుబడింది. పోలీసులు వస్తున్నారనే సమాచారం తెలిసి ముందుగానే స్మగ్లర్లు పరారయ్యారు. మేజిస్ట్రేట్ సమక్షంలో ఆ గంజాయి తూకం వేయగా 202 కేజీలు ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని సీజ్‌చేసిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా జెడ్పీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కొరాపుట్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన నబరంగ్‌పూర్ తొలి జిల్లా పరిషత్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశాన్ని జిల్లా పరిషత్ అధ్యక్షుడు మొతిరాం నాయక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ విడత సమావేశాలకు నూతనంగా గెలిపొందిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. జిల్లాలో మొత్తం 26 మంది సభ్యులు బీజేడీకి చెందినవారే కావడం విశేషం. సమావేశానికి బీజేపీ నుంచి నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, జొరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్ర హాజరయ్యారు. అలాగే బీజేడీ నుంచి డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, రాజ్యసభ ఎంపీ మున్నాఖాన్ హాజరయ్యారు. వీరందరికీ అధికారులు సమావేశం మినిట్స్ బుక్ అందించారు. అది ముందుగా ఇవ్వకుండా సమావేశంలో ఇవ్వడంతో వాటిని పరిశీలించేందుకే సమయం అయిపోయింది. ఇలా ఇవ్వడంపై ఎంపీ బలభద్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బుక్ ముందుగా ఇస్తే తాము సమావేశానికి సిద్ధమై వచ్చి ఉండేవాళ్లమని వ్యాఖ్యానించారు. ఎంపీ మున్నా ఖాన్ మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే, తన కోటా నుంచి ఇస్తానని పేర్కొన్నారు. జెడ్పీటీసీ అరుణ్ కుమార్ మిశ్ర మాట్లాడుతూ తమ ప్రాంతంలో స్కూలు ఏర్పాటు చేయకపోతే మూడు నెలల్లో రాజీనామా చేస్తానని హెచ్చరించారు. దీంతో కలెక్టర్ కమలోచన్ మిశ్ర స్పందిస్తూ పాఠశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అదుపులోకి రాని అతిసారం



వాగునీటిని వినియోగిస్తున్న గ్రామస్తులు

- మరికొందరికి అస్వస్థత
- కలుషిత నీరే ప్రధాన కారణం
- జిల్లా వైద్యశాఖ స్పష్టీకరణ

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి భొట్టంగ పాదొరొ గ్రామంలో అతిసారం అదుపులోకి రాలేదు. కలుషితమైన నీరు తాగడమే వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణమని వైద్యులు ధ్రువీకరించారు. పది రోజులుగా వ్యాధి అదుపులోకి రాకపోవడంతో గత రెండు రోజులుగా వైద్యులు ఈ గ్రామంలో వ్యాధికి గల కారణాలు గురించి అధ్యయనం చేశారు. నీటి నమూనాలను సేకరించిన వైద్య బృందం పరీక్షలు నిర్వహించింది. ఈ మేరకు కలుషితమైన తాగునీటిని సేవించడమే అతిసారకి ప్రధాన కారణంగా గుర్తించింది. దీంతో సమితి అధికారులు అప్రమత్తమై గ్రామానికి మంచినీటి ట్యాంకులను పంపిస్తున్నారు. అతిసారంతో ఈ గ్రామంలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే.

వ్యాధిబారిన మరో ముగ్గురు

ఇదిలా ఉండగా ప్రస్తుతం మరో ముగ్గురు ఈ వ్యాధి బారినపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం గ్రామానికి చెందిన విలాసి సూర్య అనే గర్భిణి అతిసారంతొ తీవ్ర అస్వస్థతకు గురై బిసంకటక్ క్రిస్టియన్ ఆస్పత్రిలో చేరింది. అదే విధంగా అదే గ్రామానికి చెందిన నిరంజన్ సూర్య, బిజేరి సూర్య అనే ఇద్దరు బిసంకటక్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వాగునీరే ఆధారం

సుమారు 20 కుటుంబాలు నివిస్తున్న భొటొంగ పాదొరొ గ్రామంలో కేవలం రెండు గొట్టపు బావులే ఉన్నాయి. వీటిలో ఒకటి పనిచేయకపోవడం, మరొక దాంట్లో బురద నీరు వస్తుండడంతో గత్యంతరం లేని గ్రామస్తులు సమీపంలోని వాగునీటిపై ఆధారపడాల్సి వస్తోంది. అసలే వర్షాకాలం కావడంతో వాగునీరు కలుషితమైనప్పటికీ అదే నీటిని తాగుతున్నారు. ఫలితంగా గ్రామంలో ఇటువంటి పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తురాలు



ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

బతికే ఉన్నాం సారూ..!



హరిరావుతో బీడీవోను కలిసిన లబ్ధిదారులు

- పెన్షన్ నిలుపుదలపై లబ్ధిదారుల ఆందోళన

జయపురం: బతికే ఉన్న తమకు పింఛన్లు అందజేయాలని బొరిగుమ్మ సమితి రనష్‌పూర్ పంచాయతీ చండాలుగుడ గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చైతన్య హరిజన్, రామ హరిజన్, చంద్రమా పూజారిలు మూడేళ్ల నుంచి వృద్ధాప్య పెన్షన్లను పొందుతున్నారు. అయితే ఈ ముగ్గురుకి 2023 సెప్టెంబర్ నుంచి పెన్షన్ రావడం లేదు. దీంతో సంబంధిత అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోవడంతో సోషల్ వర్కర్ బి.హరిరావును కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన బాధితులను తనతో పాటు బొయిపరిగుడ సమితి కార్యాలయానికి బుధవారం తీసుకొని వెళ్లి పెన్షన్‌పై అధికారులను ప్రశ్నించారు. అయితే వారు మృతి చెందారని రిపోర్టులు రావడంతో పేర్లు తొలగించినట్లు అధికారులు తెలిపారు.

అనంతరం వారు చేసిన విజ్ఞప్తుల మేరకు ఏప్రిల్ నెలలో మరలా పేర్లు చేర్చడం జరిగిందని, అందువలన వారికి మూడు నెలల పెన్షన్ లభిస్తుందని తెలిపారు. అయితే బతికి ఉన్నవారిని చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేయడంపై హరిరావు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై తాము బిసింగపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


దాస్ మృతదేహం

రాయగడ: స్థానిక పాత చెక్‌గేట్ సమీపంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భువనేశ్వర్‌లోని డుముడుమ ప్రాంతానికి చెందిన దేవేంద్ర దాస్ (23)గా పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్‌కు చెందిన ఒక ఫొటోగ్రాఫర్‌తో దేవేంద్ర కలిసి స్థానిక సనరైజ్ హోటల్‌లోని రూమ్ నంబర్ 305లో అద్దెకు దిగాడు. ఒక వివాహ కార్యక్రమానికి అసిస్టెంట్ ఫొటోగ్రాఫర్‌గా వచ్చిన దాస్ బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్‌రూమ్‌లో ఒక టవల్ సాయంతో దాస్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత


అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి మద్కపోదర్ గ్రామం వద్ద మంగళవారం రాత్రి మత్తిలి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఒక యువకుడు బైక్‌పై బస్తాను ఉంచి అతివేగంగా వెళ్తుండగా పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బస్తాలో గంజాయి బయటపడింది. దీంతో యువకుడిని అరెస్టు చేసి మత్తిలి పోలీసుస్టేషన్‌కు తరలించారు. గంజాయిని తూకం వేయగా 22 కేజీల 400 గ్రాములు ఉంది. దీని విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని మత్తిలి ఐఐసీ దేవనాంద్ మల్లిక్ తెలిపారు. అరెస్టైన వ్యక్తి కలిమెలకు చెందిన తరుణ్ మిర్జాగా నిర్ధారించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

నందిగాం: మండలంలోని సైలాడ పంచాయతీ దేవాడకు చెందిన శతాధిక వృద్ధురాలు బొడ్డ సీతమ్మ (105) బుధవారం మృతి చెందింది. ఈమె భర్త రామన్న 35 ఏళ్ల కింద చనిపోయారు. మొత్తం ఎనిమిది మంది సంతానంలో ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. పెద్దకుమారుడు ఉద్యోగ విరమణ చేసి ఇటీవలే మృతి చెందారు. మూడు రోజుల కిందట వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని సౌభాగ్యలక్ష్మి నగర్‌లో వైద్య ఉద్యోగి గనగళ్ల రాంబాబుకు చెందిన ద్విచక్ర వాహనం (పల్సర్) చోరీకి గురైంది. రాత్రి ఇంటి బయట హ్యాండిల్ లాక్ వేసి పార్కింగ్ చేసి ఉంచగా ఉదయానికి కనిపించలేదు. వెంటనే రాంబాబు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అనంతరం నరసన్నపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సారాబట్టీలు ధ్వంసం

కాశీబుగ్గ : సోంపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది కలిసి మందస మండలం కరియాపల్లిలో సారాబట్టీలపై దాడి చేశారు. అప్పటికే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలపై సమాచారం తెలిస్తే 9440902358 నంబర్‌కు తెలియజేయాలని జైభీమ్ కోరారు. ఈ గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ చంద్రమోహన్, సెబ్ సిబ్బంది కాంతారావు, యోగేశ్వరరావు, భానుప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 23 నుంచి 27 వరకు పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ జగన్నాథ మందిరం ప్రతినిధి లక్ష్మీపతి గౌరదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్డులో ఉన్న ఆనందమయి కన్వెన్షన్ హాల్ వేదికగా వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం (రామాయణ, భారత, భాగవతం, నైతికవిలువలు తదితర అంశాలు), సంప్రదాయ వేషధారణ (రామాయణ, మహాభారత, కృష్ణలీల) పోటీలు జరుగుతాయని వివరించారు. గ్రూప్–ఏ (6–8 తరగతులు), గ్రూప్–బీ (9,10 తరగతులు) విభాగాలలో ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు వరకు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7799747511, 9492764710 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అపశ్రుతులపై ఆందోళన

- రథయాత్రలో చోటుచేసుకున్న అపశ్రుతులు
- త్రిసభ్య విచారణ కమిటీ ఏర్పాటు


సేవాయత్‌లను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్రలో ఈసారి తొలి నుంచి అపశ్రుతులు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా రథయాత్రలో జాడలేని మృత్యు సంఘటనలు ఈ ఏడాది చోటు చేసుకున్న విషయం తెలిసిందే. పంచాంగం గణాంకాల ప్రకారం యాత్ర 2 రోజులు నిర్వహించారు. గుండిచా ఆవరణకు చేరిన రథాల నుంచి మూల విరాటులను అడపా మండపానికి తరలిస్తుండగా బలభద్ర స్వామి మూల విరాటు చారుమళ్లపై కుప్పకూలింది. ఈ విచారకర సంఘటనలో ఇద్దరు సేవాయత్‌లు గాయపడ్డారు. మూల విరాటు కుప్పకూలడం అత్యంత విచారకర సంఘటన. ఇటువంటి సంఘటన గతంలో ఎన్నడూ చూడలేదని భక్తజన వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఘటనపై విచారణ

రాష్ట్ర ప్రభుత్వం దీనిని ఒక తేలికపాటి విషయంగా వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై చర్యలు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి విచారణ జరిపి నివేదిక దాఖలు చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం ఘటన స్థలాన్ని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా బాధిత సేవాయత్‌లను ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఘటన లీలామయుని లీల మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఇది చిన్న ఘటనేనని, క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారని తెలిపారు. స్వామివారి ఆశీర్వాదం వలన వారు త్వరగా కోలుకుని తిరిగి పూజలు నిర్వహించారన్నారు.

ముందుకు సాగాలి: న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్

ఈ దుర్ఘటనపై న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ కూడా ఇదే తరహాలో స్పందించారు. మహా ప్రభువు లీలని ఎవరూ అర్థం చేసుకోలేరన్నారు. సంఘటన నుంచి మనం ముందుకు సాగడం మంచిదని వ్యాఖ్యనించారు. ఈ ఘటన గురించి సేవకులతో మాట్లాడినప్పుడు వారు దీనిని భగవంతుని లీలగానే అభివర్ణించినట్లు పేర్కొన్నారు. ఘటన మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగింది, కొంతమంది సేవకులు రథం నుంచి గుండిచా ఆలయం అడపా మండపానికి తరలించేందుకు బలభద్ర స్వామిని దించుతుండగా తాత్కాలిక మెట్ల నుండి జారిపడిందన్నారు. 150 కిలోల పైబడి బరువు కలిగిన 7 అడుగుల ఎత్తులో ఉన్న బలభద్రుడి విగ్రహం కింద పలువురు సేవాయత్‌లు చిక్కుకున్నట్లు వెల్లడించారు. వారిని తోటి సేవాయత్‌లు, పోలీసు సిబ్బంది రక్షించి తక్షణమే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మూల విరాటుని దించేందుకు అమర్చిన తాళ్లు వదులు కావడంతో పట్టు కోల్పోయి విగ్రహం జారిందని పేర్కొన్నారు.

దిగ్భ్రాంతికి గురి చేసింది: గజపతి మహారాజా

శ్రీ మందిరం పాలక మండలి అధ్యక్షుడు, శ్రీ జగన్నాథుని తొలి సేవకుడు పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ మంగళవారం పుణ్యక్షేత్రం శారదా బాలి ప్రాంగణంలో అడపా పాహండి సందర్భంగా బలభద్ర స్వామి మూల విరాటు కుప్పకూలడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం వ్యక్తం చేశారు. జరగరాని ఘటన జరిగిపోయిందన్నారు. ఈ తప్పిదం పూర్వాపరాలను అనుబంధ వర్గాలు సమీక్షించుకుని రానున్న రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా సేవాయత్‌లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విచారణ కమిటీ ఏర్పాటు

రథంపై బలభద్ర స్వామి మూల విరాటు జారిన సంఘటనపై విచారణ కోసం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సంఘటన పూర్వాపరాలను ఈ కమిటీ తనిఖీ చేస్తుంది. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ డ్రోన్ మరియు ఇతర వీడియో ఫుటేజీలను పరిశీలిస్తుంది. కమిటీలో అభివృద్ధి అడ్మినిస్ట్రేటర్, అదనపు జిల్లా మేజిస్ట్రేటు, డిప్యూటీ సూపరింటెండెంట్ సభ్యులుగా ఉంటారని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) వీర్ విక్రమ్ యాదవ్ తెలిపారు. నీలాద్రి విజే నుంచి 10 రోజుల్లో కమిటీ నివేదిక దాఖలు చేస్తుందన్నారు. సాయంత్రం 7.15 గంటలకు ఆరంభమైన అడపా పాహండి మంగళవారం అర్ధరాత్రి 12.10 గంటల వరకు కొనసాగింది. దీంతో స్వామి ఏకాంత సేవకు దూరమయ్యారు.

ప్రతిపాదన తేదీకి ఆమోదం


పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: శ్రీమందిరం రత్న భాండాగారం తెరిచే తేదీని పాలక మండలి ఆమోదించిందని ప్రధాన పాలన అధికారి(సీఏఓ) వీర్ విక్రమ్ యాదవ్ తెలిపారు. పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన బుధవారం పాలక మండలి సమావేశమైంది. ఇటీవల ఈనెల 14న రత్న భాండాగారం తెరిచేందుకు ఉన్నత స్థాయి తనిఖీ కమిటీ ప్రతిపాదించింది. రత్న భాండాగారం తెరిచేందుకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ ప్రక్రియ చేపట్టలేమని సీఏవో వివరించారు. జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలో 16 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి తనిఖీ పర్యవేక్షక కమిటీ ప్రతిపాదనపై సమావేశంలో లోతుగా చర్చించినట్లు తెలిపారు. ఈ కమిటీ ప్రతిపాదించిన రత్న భాండాగారం తెరవడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌పీఓ)ని పరిశీలించిన పాలక మండలి మరికొన్ని సూచనలు జోడించింది. ప్రభుత్వ ఆమోదం కోసం సిఫారసు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత వీటి వివరాలను బహిరంగపరచడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం నిరీక్షిస్తున్నారు. ఆమోదం అందడంతో రత్న భాండాగారం తెరిచే ప్రక్రియ తక్షణమే ప్రారంభిస్తామన్నారు.

మల్కన్‌గిరిలో మంత్రి నిత్యానంద్ పర్యటన


సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నిత్యానంద్ గోండో

మల్కన్‌గిరి: జిల్లాలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద్ గోండో బుధవారం పర్యటించారు. ముందుగా స్థానికంగా ఉన్నటువంటి పాఠశాలలను సందర్శించారు. అనంతరం మల్కన్‌గిరి డీఈవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి 120 పాఠశాలల్లో ఉన్న సమస్యలపై ఉపాధ్యాయ సంఘం అందించిన వినతిపత్రం స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల రైల్వేలైన్ కల నెరువేరుస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సచిన్ పవార్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా ద్విశతావధానం


అవధాన ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో స్థానిక వైజయంతి ఉత్సవ మండపంలో ద్విశతావధాన కళావిలాస కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అవధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ తెలుగు భాషకు వన్నె తెచ్చిన సాహిత్య ప్రక్రియ అవధానమని పేర్కొన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, విశ్రాంత రిజిస్ట్రార్ గుంట తులసీరావు, వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి వరం అవధానమని చెప్పారు.

ఆకట్టుకున్న సాహిత్య ప్రక్రియలు..

సభా సంచాలకులు విశాఖకు చెందిన డాక్టర్ పేరి రవికుమార్, సభాధ్యక్షుడు విజయవాడకు చెందిన పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌లు మాట్లాడుతూ అవధాన ప్రక్రియను మొదటిగా మాడభూషి వెంకటాచార్యులు ప్రవేశపెట్టాని, తదుపతి తిరుపతి వెంకట కవులు కొనసాగించారని తెలిపారు. అప్రస్తుత ప్రసంగీకులుగా విజయవాడకు చెందిన పంతులు తపస్వి, దండిభోట్ల దత్తాత్రేయ శర్మలు పలు అప్రస్తుత సమస్యలను చెబుతూ సమాధానాలు రాబట్టారు. పైడి హరనాధరావు 'దంష్ట్రాఘాతం నేల కొరిగేన్' అని, సుసరాపు చంద్రశేఖరశర్మ 'కొండయున్నది భానుని కొలనులోన' అని, కర్నేన జనార్దనరావు 'మునిఘాతంబున జచ్చె రాక్షసుడు సమ్మోదంబుగా' వంటి సమస్యాపూరణాలను ఇవ్వగా అవధాని పూరణ చేశారు. దత్తపదిలో కె.వి.రాజారావు లతిక, గీతిక, వీచిక, వేదిక పదాలతో అస్సాం వరదలలో పడవలో ప్రసవించిన ఓ గర్భిణి దుస్థితిని పద్యంగా చెప్పమని.. తమ్మినేని సూర్యనారాయణ ధనము, జనము, వనము, దినము అనే పదాలతో పర్యావరణ పరిరక్షణ కోసం చెప్పమనగా ఒక్కో పాదం చక్కగా పూరించారు. మొత్తంగా 25 మంది దత్తపదులను ఇచ్చారు. సాయంత్రం 25 వర్ణనలకు అవధాని పద్యరూపంలో సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, నీరజ సుబ్రహ్మణ్యం, కె.సురేష్, మురళీధర్, బంకుపల్లి శంకరం, పూజ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో పరిశుభ్రతకు పెద్దపీట

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల్లో పరిసరాలు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యా శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల ఆవరణ, తరగతి గదులు, సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి చెత్తా లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన కుటుంబాల్లో పేద పిల్లలకు విద్యా పథకాలను అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన రెడ్డి, బీసీ సంక్షేమాధికారి బి.అనురాధ, డీసీఓ బాలాజీ నాయక్, ఏసీఈ లియాఖత్ అలీఖాన్, ఏపీసీ జయప్రకాశ్, ఆర్‌ఐఓ దుర్గా రావు, డీవీఓ తవిటి నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ చక్రధరరావు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో కార్పస్ నిధి

- మంత్రి మండలి ఆమోదం


మంత్రి మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఒడియా అస్మితా భవన్ కోసం రూ.200 కోట్ల కార్పస్ నిధి ఏర్పాటుతో సహా 5 ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి బుధవారం ఆమోదం తెలిపింది. ఒడియా అనువాద అకాడమీ స్థాపన మరియు వివిధ వర్గాల కార్మికులకు కనీస వేతనాల పెంచేందుకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. స్థానిక లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. కార్పస్ నిధితో ఒడియా అస్మితను పునరుద్ధరించడం మరియు రాష్ట్ర సంస్కృతి, కళ మరియు వారసత్వాన్ని ప్రోత్సహించడం మరియు సంరక్షించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

వర్సిటీల్లో ఒడియా పీఠాలు

ఒడియా అస్మిత భవన్, తాళపత్ర మాన్యుస్క్రిప్ట్ మ్యూజియం, ఒడియా అనువాద అకాడమీ, పాయికా విప్లవ స్మృతి అభివృద్ధి, ఈ – లైబ్రరీ మరియు జాతీయ మరియు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ఒడియా పీఠాల ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. బాలి జాతర ఉత్సవానికి అంతర్జాతీయ హోదాను సాధించేందుకు, కళాకర్ గౌరవ నిధి యోజన ద్వారా ఒడిస్సీ సంగీతం, నృత్యంలో శిక్షణ కోసం ఆర్థిక సాయం అందించడానికి కూడా ప్రయత్నాలు చేయబడతాయన్నారు. ఈ నేపథ్యంలో వివరణాత్మక మార్గదర్శకాలు సిద్ధం చేసి సమీక్షించేందుకు నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో అవసరమైన మేరకు కార్పస్ నిధి పెరుగుతుందని వెల్లడించారు.

టీచర్ల నియామకాలు వేగవంతం

మరో ప్రధాన నిర్ణయంలో మంత్రి మండలి 18,700 మంది జూనియర్ టీచర్ల నియామకాన్ని వేగవంతం చేయాలని పాఠశాల మరియు సామూహిక విద్యా శాఖను ఆదేశించింది. ఉన్నత, మధ్య, నిమ్న స్థాయి గ్రామీణ, పట్టణ రైతులతో సహా దాదాపు 5 నుంచి 6 లక్షల మంది అర్హులైన రైతులను పీఎం కిసాన్ పథకం కింద చేర్చేందుకు మంత్రి మండలి అంగీకారం లభించింది. మునుపటి బిజూ జనతా దళ్ ప్రభుత్వం యొక్క కాలియా యోజన నిర్దేశించిన ప్రామాణికాల కారణంగా ఈ రైతులకు గతంలో ప్రయోజనాలు నిరాకరించబడినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల సాగు ప్రాజెక్టుల పునరుద్ధరణకు, నీటి పారుదల ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు రానున్న ఐదేళ్లలో రూ. 1,044 కోట్లు వెచ్చించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన పలు ఇతర ప్రధాన ప్రతిపాదనలకు మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

కార్మికులకు వేతనాలు పెంపు

వివిధ వర్గాల కార్మికులకు కనీస వేతనాలు పెంచే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నైపుణ్యం లేని సాధారణ కార్మికులకు రూ.352 నుంచి రూ. 450కి, పాక్షిక నైపుణ్య కార్మికులకు రూ.392 నుంచి రూ.500కి, నైపుణ్య కార్మికులకు రూ.442 నుంచి రూ.550కి, ఉన్నత నైపుణ్య కార్మికులకు రూ.502 నుంచి రూ.600కి పెంచనున్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గం రెండోసారి సమావేశం అయింది. జూన్ 12న బీజేపీ మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే జరిగిన మొదటి సమావేశం, పూరీలోని శ్రీ జగన్నాథ దేవాలయం యొక్క మొత్తం నాలుగు ద్వారాలను తిరిగి తెరవడానికి మరియు 12వ శతాబ్దపు మందిరానికి కార్పస్ నిధి ఏర్పాటుకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

వరాహ అవతారంలో జగన్నాథుడు


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో వరాహ అవతారంలో జగన్నాథుడి దర్శనం

గుండిచా మందిరంలో కొలువైయున్న శ్రీజగన్నాథుడు బుధవారం వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారిని మనసారా దర్శించుకోవాలని భక్తులు బారులుతీరారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కొరాపుట్‌లో వరాహ అవతారంలో దర్శనం


పర్లాకిమిడి: నృసింహా, వరాహ అవతారంలో శ్రీజగన్నాథ, బలరాములు


రాయగడలో జగన్నాథుడి దర్శనం


జయపురం: పూర్ణఘడ్‌లో కశ్యపు అవతారంలో దేవతలు


జయపురం: మత్స్య, కశ్యపు అవతారాల్లో దర్శనమిచ్చిన దేవతామూర్తులు


రాయగడ: గుణుపూర్‌లో దేవదేవుడి దర్శనం


రాయగడ: లలిత సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షణ చేస్తున్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఈఓ ప్రసాదరావు తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం అమ్మవారి కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు మాట్లాడుతూ అమ్మవారి చదురుగుడిలో ఉన్న తొమ్మిది హుండీల నుంచి 37 రోజులకు గాను రూ.13 లక్షల 43 వేల 881 నగదు, 18 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 486 గ్రాముల వెండి లభించిందని చెప్పారు. జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ పర్యవేక్షణలో తనిఖీదారు పీవీ.లక్ష్మి , పోలీస్ అధికారులు, కెనరా బ్యాంక్ అధికారులు, పైడితల్లి ఆలయ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

15న సహారా బాధితుల ర్యాలీ



మాట్లాడుతున్న సీనియర్ కార్యకర్త దాస్

పార్వతీపురం: ఈనెల 15న పార్వతీపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు సహారా బాధితులతో ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర జిల్లాల సహారా సీనియర్ కార్యకర్త బీఎల్ దాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో కార్యకర్తలు, బాధితులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహారా బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో చేపట్టే ర్యాలీని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, ఖాతాదారులు హాజరు కావాలని కోరారు.

ముగ్గురు యువకులకు గాయాలు

కొత్తవలస: అరకు–విశాఖ రోడ్డులో తుమ్మికాపల్లి గేటు సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు గాయాల పాలయ్యారు. బుధవారం జరిగిన ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన హేమకుమార్, పవన్‌కుమార్‌లు ద్విచక్రవాహనంపై కొత్తవలస వైపు వస్తున్నారు. ఈ క్రమంలో తుమ్మికాపల్లి గేటు సమీపంలో రోడ్డు దాటుతున్న లక్కవరపుకోట మండలం పోతంపేట గ్రామానికి చెందిన భాస్కర్‌ను తప్పించబోయి ఢీకొట్టారు.దీంతో డ్రైవింగ్ చేస్తున్న హేమకుమార్‌కు తీవ్రగాయాలు కాగా పవన్ కుమార్, భాస్కర్‌లు స్వల్ప గాయాలపాలయారు. దీంతో వారిని స్థానికుల సహాయంతో కొత్తవలస పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

మైనర్లకు బైకులిస్తే తల్లిదండ్రులపై కేసులు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: మైనర్లకు బైకులిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు, నంబర్ ప్లేట్స్ సక్రమంగా లేని వాహనాదారులకు ఈ చలానాలు విధించారు. వాహనాలు నడుపుతుండగా కనిపించిన మైనర్లను అడ్డుకుని వారి వాహనాలను స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను, వాహన యజమానులను స్టేషన్‌కు పిలిపించి, వారి సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్‌లకు వాహనాలివ్వడం వాహన యజమానులదే తప్పని, మైనర్ల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు హరిబాబు నాయుడు, నరేష్ పాల్గొన్నారు.

పాత మార్కొండపుట్టిలో గజరాజులు

కొమరాడ: మండల వాసులను గజరాజుల సమస్య వీడడం లేదు. పొలాలు, గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తోటపల్లి ముంపు ప్రాంతమైన పాత మార్కొండపుట్టి గ్రామ పరిసరాల్లో బుధవారం సంచరించాయి. వరి ఆకుమడులను ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలుపెడుతున్నారు. ఏనుగుల సంచారంతో కూరగాయలు, అరటి తోటలు నాశనమవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట బీమా సంగతేంటి?

- ప్రీమియం భారం రైతు భరించాల్సిందేనా?
- పాత విధానం అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు
- గడిచిన ఐదేళ్లలో ప్రీమియం చెల్లించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



నారు పోయడానికి పొలం దున్నుతున్న రైతు

విజయనగరం ఫోర్ట్: రైతన్నకు కష్టాలు మళ్లీ మొదలు కానున్నాయా? అంటే ప్రస్తుత పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రైతులకు గత ప్రభుత్వం కంటే ఎక్కువ మేలు చేస్తానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు రైతులకు చుక్కలు చూపిస్తోంది. రైతు భరోసా పథకం కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పిన హామీకి ఇంతవరకు అతీగతీ లేదు. దీంతో రైతన్న దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. విత్తు దగ్గర నుంచి ఎరువు వరకు అన్నీ వారి చెంతకే అందించింది. పంట పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 సాయం అందించింది. అంతేకాకుండా పంట బీమా ప్రీమియం కూడా రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించేది. ఏటా బీమా ప్రీమియం కోసం కోట్లాది రుపాయలు వెచ్చించింది. పంటనష్టం జరిగితే బీమా పరిహారాన్ని కూడా సకాలంలో అందజేసేది.

పాత విధానంలో అమలు అంటే?

ఇదిలా ఉండగా ప్రభుత్వం పంటల బీమాను పాత విధానంలోనే అమలు చేయాలని కొద్ది రోజుల క్రితం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు చెప్పారు. పాత విధానంలో అంటే రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇది వారికి భారం కానుంది. దీంతో రైతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును గుర్తు తెచ్చుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉచిత బీమా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. పంటలబీమాకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన పూర్తి ప్రీమియాన్ని ఏటా రూ.13 కోట్లు వరకు చెల్లించేది. పంట సాగు చేసిన రైతులు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు. ఈకేవైసీ అయిన పంటకు ప్రభుత్వం పంటలబీమా కింద ప్రీమియం చెల్లించింది. దీని వల్ల ఏదైనా విపత్తు వచ్చి పంటనష్టం జరిగితే పంట దెబ్బతిన్న రైతులందరికీ బీమా సొమ్ము అందేది.

బీమా కింద రూ. 33.08 కోట్ల చెల్లింపు

జిల్లాలో 2019 నుంచి 2022–23 వరకు జరిగిన పంట నష్టానికి 37, 497 మంది రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.33.08 కోట్లు పంటల బీమా కింద చెల్లించింది. వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమాను అమలు చేసేది. జిల్లాలో ప్రస్తుతం వరి పంట 93 వేల హెక్టార్లు, మొక్కజొన్న 15 వేల హెక్టార్లు, ఉద్యాన పంటలు 60 వేల హెక్టార్లలో సాగవుతున్నాయి.

నిబంధనలు రాలేదు

పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి నియమ నిబంధనలు ఇంకా రాలేదు. గైడ్‌లైన్స్ వచ్చిన తర్వాత వాటి ఆధారంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తాం.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఎం.సింగుపురంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాలకొండ రూరల్: పిల్లవాడు మంచి స్థితిలో ఉన్నప్పుడే గురువు సంతృప్తి పొందుతాడని.. దానిని ఉపాధ్యాయులు, అధికారులు తమ పనితీరుగా భావించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పాలకొండ మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీ, ప్రభుత్వ పాఠశాల, మల్లివీడు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పనితీరును ఆకస్మికంగా పరిశీలించారు. ఆ సమయంలో అధికారులనుద్దేశించి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పై విధంగా పేర్కొన్నారు. తొలుత పీహెచ్‌సీకి చేరుకున్న కలెక్టర్ అక్కడ సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సలహాలను స్వీకరించారు. వైద్యాధికారి ఎస్.రవికుమార్ పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలు, అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ పలు ప్రశ్నలు సంధించారు. కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థుల ప్రతిభాపాటవాలు, మధ్యాహ్న భోజన తీరుపై ఆరాతీశారు. అనంతరం సమీప గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలు నిస్సంకోచంగా వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అధికారులు అత్యంత నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ రణస్థలం రామదేవి, రాంబాబు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తదితరులున్నారు.

కాలిపోయిన ఎర్రచందనం, టేకు చెట్లు



కాలిపోయిన చెట్లు

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎర్రచందనం, టేకు చెట్లు కాలిపోయాయి. ఇందుకు సంబంధించి ఎస్‌కోట అగ్నిమాపక సిబ్బంది అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గేదెల సత్తిబాబుకు ఉన్న జిరాయతీ పొలం సుమారు ఎకరాన్నరలో సాగుచేస్తున్న ఎర్రచందనం , టేకు మొక్కలు అగ్నిప్రమాదంలో కాలిపోతున్నట్లు గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు లక్షరూపాయల అస్తినష్టం సంభవించి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సమీపంలో చెత్తకు నిప్పుపెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



బాడంగిలో ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

బాడంగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ మేరకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంవద్ద వారంతా సమావేశమై నినాదాలు చేస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తమ కోర్కెలతోకూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ కె.రాజ్యలక్ష్మికి అందజేశారు. వారి డిమాండ్లలో ముఖ్యంగా కొన్ని కేంద్రాలలోఅధికారపార్టీ నాయకులు, కార్యకర్తలను బలవంతంగా రాజీనామాలు చేయమని బెదిరిస్తున్నారని, సెంటర్లకు తాళాలు కూడా వేస్తున్నారని హెల్పర్లను ఉద్యోగాలు మానేయాలని బెదిరిస్తున్నారని అలాంటివేధింపులుమానుకోవాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్‌పెంచాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. గతంలో 45రోజులసమ్మెకాలంలో గత ప్రభుత్వం జారీచేసిన మినిట్స్‌కాపీలను జీఓలుగా మార్చాలని డిమాండ్ చేశారు. వాటితోపాటు మరికొన్ని డిమాండ్లతో వారంతా నిరసనవ్యక్తంచేశారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షురాలు చింతాడరమణమ్మ, సంఘం ప్రతినిధులు, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పల బాధతో హోంగార్డు ఆత్మహత్య



శ్రీనివాసరావు(ఫైల్)



ఆత్మహత్యకు పాల్పడిన హోంగార్డు శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం గ్రామానికి చెందిన హోంగార్డు కాత్రగాన శ్రీనివాసరావు(47) అప్పుల బాధ తాళలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రాజాం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు శ్రీనివాస రావు ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఇంటి అవసరాల నిమిత్తం అధికమొత్తంలో అప్పులుచేశాడు. అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతూ తనలో తానే కుమిలిపోయేవాడు. ఈ కారణంగానే పురుగు మందు తాగేశాడని తెలుసుకుని రాజాం ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. పరిస్థితి కుదుటపడక పోగా విషమించడంతో రాగోలు జెమ్స్‌కు తరలించి వైద్యం అందించినప్పటికీ ఫలితం లేకపోయిందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉదయకుమారితో పాటు కుమారుడు ప్రేమ్ కుమార్, కుమార్తె ప్రసన్నలత ఉన్నారు. కుమార్తెకు వివాహం జరిగి అత్తవారింటివద్ద ఉంటోంది. కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. హోంగార్డు ఆత్మహత్యపై భార్య ఉదయకుమారి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

గడ్డి మందు తాగి మహిళ మృతి

వీరఘట్టం: మండలంలోని యు.వెంకంపేట గ్రామానికి చెందిన వాన రమణమ్మ (55) బుధవారం పొరపాటున గడ్డి మందు తాగి మృతి చెందింది. దీనిపై గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణమ్మ నిత్యం మందులు, టానిక్‌లు వాడుతోంది. ఈ క్రమంలో ఆమె తాను వాడే టానిక్స్ పక్కనే పంట చేలో పిచికారీ చేసేందుకు తెచ్చిన గడ్డి మందు ఉండడంతో అనుకోకుండా కొంచెం గడ్డి మందును తీసుకుంది. గడ్డి మందు తాగిన తర్వాత గొంతు, నోటిలో మంట పుట్టడంతో గట్టిగా కేకలు వేయగా భర్త నారాయణరావు, బంధువులు గమనించి ఆమెను వీరఘట్టం పీహెచ్‌సీకి తీసుకువచ్చి వైద్య చికిత్సలు అందజేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.ఈ విషయంపై శ్రీకాకుళం రిమ్స్ నుంచి సమాచారం వచ్చినట్లు ఎస్సై ఫకృద్దీన్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో హోంగార్డు మృతి



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర కొత్తవలస ఏఆర్ ఎస్సై, వల్లంపూడి ఎస్సై రాజేష్



హోంగార్డు వెంకటసత్యం (ఫైల్)

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన హోంగార్డు గిడుతూరి వెంకటసత్యం (48) విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందారు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటసత్యం కొత్తవలస దిశ పోలీస్‌స్టేషన్‌లో జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 6గంటల సమయంలో ఇంటి సమీపంలో ఉన్న పాన్ షాప్ దగ్గర ఐరన్‌రాడ్‌తో నిలబడిన సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. దీనిపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని, పోస్టుమార్టం ఎస్.కోట ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించామని ఎస్సై రాజేష్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఎస్.కోట రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర బొద్దాం వెళ్లి మృతిచెందిన వెంకటసత్యం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన సౌకర్యాలు అందేలా చూస్తామని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య పార్వతి, కొడుకు , కూతురు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

పార్వతీపురం టౌన్: మక్కువ నుంచి చెముడు వెళ్తుండగా మార్గమధ్యంలో మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ గ్రామానికి చెందిన గొర్జన వెంకటనాయుడు (70), ఎల్.శ్రీరామం బైక్‌పై మక్కువ నుంచి చెముడు వెళ్తుండగా మార్గమధ్యంలో వైఎస్సార్ కాలనీ దాటే సరికి ఎదురుగా పశువులు రావడంతో సడన్ బ్రేక్ వేయగా బైక్ స్కిడ్ అయి వారిద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో స్థానికులు గమనించి వారిద్దరినీ మక్కువలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా డాక్టర్ ప్రథమ చికిత్స చేసి పార్వతీపురం తీసుకువెళ్లాలని సూచించగా కారులో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయమైన వెంకటనాయుడు(70) చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీరామ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు.

హరహర మహాదేవ..

- గుళ్ల సీతారాంపురంలో శైవశిల్పాలు
- 10వ శతాబ్దంలో శైవక్షేత్రంగా విరాజిల్లిన గ్రామం



సీతారాముల ఆలయ ముఖ ద్వారంపై చెక్కిన శృంగార శిల్పం




అలంకరించిన పదవ శతాబ్దపు నంది



కళింగ శైలి నంది



పదవ శతాబ్దపు శివలింగం



అరుదైన వినాయకుడి విగ్రహం



కాళికాదేవి

రాజాం సిటీ: అపూర్వమైన శైవశిల్పాలకు ఆలవాలం గుళ్లసీతారాంపురం గ్రామమని, పదవ శతాబ్దంలో ప్రసిద్ధి శైవక్షేత్రంగా విరాజిల్లిందని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. రాజాం చరిత్ర రచనలో భాగంగా ఇటీవల ఆయన ఆ గ్రామాన్ని సందర్శించిన సమయంలో ఈ విషయం కనుగొన్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ..350 ఏళ్లుగా బొబ్బిలి రాజుల కాలం నుంచి సీతారామ క్షేత్రంగా పిలిచే ఈ ఊరు గంగరాజుల కాలంలో ప్రసిద్ధ శైవ క్షేత్రమని, గతంలో ముగడపేట, గొల్ల సీతారాంపురంగా పిలిచేవారన్నారు. దక్షిణాన తోటలోని శివాలయంలో 10వ శతాబ్దపు లింగం, అలంకరించిన నందిని తాను చూశానని తెలిపారు. ఈ ఆలయంలో వినాయకుడి విగ్రహం నాలుగు చేతులు కలిగి ఉందని, చేతులలో సర్పం, ఢమరుకంతో శివలింగం, కుడుము గల అతి అరుదైన శిల్పమని పేర్కొన్నారు. అలాగే కళింగ శైలి నంది, కాళికాదేవి, కళింగానికి చెందిన శివలింగం ఉన్నాయని అన్నారు. అవి క్రీస్తు శకం 10వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం మధ్యలో అప్పుడప్పుడు చెక్కించిన విగ్రహాలని తెలిపారు. అంతేకాకుండా సీతారాముల ఆలయ ముఖద్వారంపై ఇదే కాలానికి చెందిన శృంగార శిల్పం, ఆలయానికి ముందర ఖాళీ స్థలంలో లలితాదేవి విగ్రహం ఉన్నాయని, అవన్నీ అత్యంత ప్రాచీనమైనవన్నారు. ఈ విగ్రహాల స్థితిగతులపై ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఈమని శివనాగిరెడ్డిని సంప్రదించగా ఆయా దేవతలను, కాలాలను ఆయన ధ్రువీకరించారని రంగనాథం తెలిపారు. సమావేశంలో పిల్లా తిరుపతిరావు, డాక్టర్ ఆల్తి మోహనరావు, గార సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రధాన న్యామూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం క్రైమ్: నూతన చట్టాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో కొత్త చట్టాలపై బుధవారం విజయనగరం, మన్యం జిల్లాల పోలీస్ అధికారులు, మోటార్ వాహన అధికారులు, సచివాలయ మహిళా సంరక్షణ పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత న్యాయవ్యవస్థలో వచ్చిన కొత్త చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ న్యాయ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియం తదితరవాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. మోటార్ వాహనాల చట్టం గురించి వివరించారు. చట్టాలను కఠినంగా అమలుచేయాలని సూచించారు. హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కల్యాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్, నేరపరిశోధనలో తీసుకోవాల్సి న జాగ్రత్తలు, కొ త్త చట్టాల్లో వచ్చిన మార్పులను వి వరించారు. ప్రొబేషన్ అధికారి ఎం.శరత్ బాబు జువైనల్ చట్టాలపైన అవగాహన కల్పించారు. కా ర్యక్రమంలో అధి క సంఖ్యలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైనాపిల్ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ



పైనాపిల్ జామ్ తయారీపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని అడ్డంగి గ్రామంలో పైనాపిల్ ఆధారిత ఉత్పత్తుల తయారీపై 12 మంది యువతీయువకులకు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. పైనాపిల్‌తో జామ్‌జ్యూస్ క్యాండీ తయారుచేసే విధానాన్ని కేవీకే ఆమదాలవలస సైంటిస్ట్ సుజాత వివరించారు. పైనాపిల్‌లో విటమిన్–సి సమృద్ధిగా ఉంటుందని, వీటిలోని యాంటీ యాక్సిడెంట్ ఒత్తిడితో పోరాడి గుండె జబ్బులు రాకుండా చేస్తూ, రక్తపోటును అదుపులో ఉంచుతుందన్నారు. చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆనందరావు, వసంత పాల్గొన్నారు.

విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య కార్డు

- పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: విద్యార్థుల సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమశాఖ, వైద్యారోగ్యశాఖ, జీసీసీ తదితర శాఖాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, నిరంతర పర్యవేక్షణకు సమగ్ర ఆరోగ్య కార్డులు (ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కార్డులు) అందజేయాలని సూచించారు. జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జీవనోపాధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో పౌష్టికాహార విలువలు గల కూరగాయలను విద్యార్థులతో నిర్వహించాలన్నారు. వసతిగృహాల్లో దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. మైస్కూల్ మైప్రైడ్ కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో మంచి సైన్స్ ఫెయిర్ నిర్వహించాలన్నారు. ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గిరిజన సంక్షేమశాఖ, ఐటీడీఏ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.